ఈనాడు
పల్నాడు
బుధవారం సెప్టెంబరు 25, 2024

విధేయతకు అందలం

- కూటమి శ్రేణులకు నామినేటెడ్ పదవులు
- క్రియాశీలక కార్యకర్తలకు తగిన గుర్తింపు

ఈనాడు–నరసరావుపేట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్‌లు, సభ్యులను మంగళవారం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్యకర్తలకు పదవులు ప్రకటించి ఆనందాన్ని నింపింది. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నవారికి పట్టం కట్టారు. వైకాపా ఐదేళ్ల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలకు అండగా నిలబడిన ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యకర్తలు, నేతలకు తెదేపా, బీజేపీ, జనసేనలో పెద్దపీట వేశారు. వివిధ సమీకరణలు పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం అన్ని సామాజికవర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తూ పదవులు భర్తీ చేశారు. దీంతో ఆయా వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

❖ మంగళగిరికి చెందిన తెదేపా సీనియర్ నేత నందం అబద్దయ్యను రాష్ట్ర పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించింది. నందం అబద్దయ్య 1982 నుంచి తెదేపాలో కొనసాగుతున్నారు. జిల్లా స్థాయిలో పార్టీలో వివిధ హోదాల్లో పని చేశారు. మంగళగిరి నియోజకవర్గానికి నారా లోకేష్ వచ్చిన తర్వాత నందం అబద్దయ్య పని తీరును గుర్తించి 2021లో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా నియమించారు.

❖ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పిల్లి మాణిక్యరావు నియమితులయ్యారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పిల్లి మాణిక్యరావు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వినుకొండ నియోజకవర్గం పరిశీలకులుగా పనిచేశారు. ఎమ్మార్పీఎస్‌లో వివిధ హోదాల్లో పని చేసి 2017లో రాజీనామా చేసి తెదేపాలో చేరారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా పదవులు నిర్వర్తించారు. గత ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి సీటు ఆశించారు. ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో తెదేపా అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహించారు.

❖ ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా కుర్రా అప్పారావు నియమితులయ్యారు. చిలకలూరిపేట నియోజకవర్గం యడ్లపాడు మండలం ఉన్నవ స్వగ్రామం. గతంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. పార్టీలో 35 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. కుర్రా అప్పారావు తండ్రి ఉన్నవ గ్రామ సర్పంచిగా, జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్‌గా పని చేశారు.

అన్నదాతకు కొండంత అండ

వరద నష్టం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట



పెదకూరపాడు : వరదలకు దెబ్బతిన్న పత్తి పంటను చూపుతున్న రైతులు (పాతచిత్రం)

వరదలు ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతకు ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఈ నెల ఆరంభంలో వరదార్పణమైంది. నెల రోజుల్లోపే పంట నష్ట పరిహారం ఆయా రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి రాయితీ బుధవారం రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గత ఐదేళ్లలో ఏటా అకాల వర్షాలతో పాటు, తుపాన్లకు జిల్లాలో భారీగా పంట నష్టం చవిచూసినా వైకాపా ప్రభుత్వం ఆదుకోలేదని, రెండేళ్ల పెట్టుబడి రాయితీ పెండింగ్‌లో ఉందని రైతులు గుర్తుచేస్తున్నారు. అనుకోని ఉపద్రవం వెంటాడినా.. వరదలతో తమ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుర్తించి సకాలంలో తమను ఆదుకోవడం గొప్ప విషయమని చెబుతున్నారు. వ్యవసాయ పంటలకు రూ.6.08 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.15.40 లక్షలు పెట్టుబడి రాయితీ జిల్లాకు మంజూరు కానుంది. పంటలు, పశువులు, దెబ్బతిన్న ఇళ్లు మొత్తం కలిపి జిల్లా నుంచి రూ.6.30 కోట్ల పరిహారానికి జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

వ్యవసాయ పంటలు

పంట నష్టం	:	2,452 హెక్టార్లు
బాధిత రైతులు	:	6,240 మంది
పెట్టుబడి రాయితీ	:	రూ.6.08 కోట్లు

ఉద్యాన పంటలు

పంట నష్టం	:	49.20 హెక్టార్లు
రైతులు	:	79 మంది
పెట్టుబడి రాయితీ	:	రూ.15.40 లక్షలు

అమరావతి ప్రాంతంలో నీటమునిగిన పైర్లు


జిల్లాలో సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వానలకు కృష్ణానది తీర ప్రాంతం బాగా ప్రభావితమైంది. దాచేపల్లి, మాచవరం, అచ్చంపేట, అమరావతి మండలాల్లో వరద నీరు పంట పొలాల్లోకి పోటెత్తింది. అమరావతి మండలంలో అయితే ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు వాగులు ఉద్ధృతంగా ప్రవహించి పంట పొలాలను ముంచెత్తి చెరువుల్లా మార్చేశాయి. వానలు తగ్గుముఖం పట్టి నాలుగు రోజులైనా పొలాల నుంచి నీరు బయటకు పోలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పొచ్చు. చివరకు వ్యవసాయ సిబ్బంది కూడా పంట నష్టం ప్రాథమిక అంచనా వేయలేని పరిస్థితి తలెత్తింది. అమరావతి మండల రైతులు భారీగా నష్టపోయారు. అలాగే దాచేపల్లి, అచ్చంపేట, మాచవరం మండలాల్లోనూ కృష్ణమ్మ వరదతో పొలాల్లో ఇసుక మేటలు వేశాయి.

వెనువెంటనే నష్టం లెక్కింపు

పంట వరదలో ఉండగానే వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో తిరుగుతూ పంట నష్టం అంచనా ప్రారంభించారు. ప్రాథమిక అంచనా అయ్యాక వెంటనే ఎన్యూమరేషన్ ప్రారంభించారు. ఈనెల 11న ప్రాథమిక అంచనా చేసి, 19న ఎన్యూమరేషన్ పూర్తిచేసి నివేదిక అందించారు. 33 శాతంపైగా పంట నష్టం వాటిల్లిన రైతులను గుర్తించి పూర్తి వివరాలు సేకరించి పెట్టుబడి రాయితీకి ప్రతిపాదనలు పంపించారు. వరదల్లో 15 శాతానికి మించి దెబ్బతిన్న ప్రతి ఇంటికి సీఎం ఆదేశాల మేరకు రూ.10 వేల తక్షణ సాయం అందించనున్నారు. జిల్లాలో 6 పక్కా ఇళ్లు, 69 కచ్చా ఇళ్లు, 17 గుడిసెలు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. దెబ్బతిన్న ఇళ్లకు మొత్తం రూ.92 వేలు, 5 పశువుల నష్టానికి రూ.88 వేలు, వరదలో ఒకరు కొట్టుకుపోవడంతో అతని కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందనుంది.

స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగస్వాములవ్వాలి : కలెక్టర్

శావల్యాపురం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనలో ప్రజలు భాగస్వాములవ్వాలని, అందుకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం శావల్యాపురం మండలం వేల్పూరులో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో 7 లక్షల నివాసాలను సచివాలయ సిబ్బంది సందర్శించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారని చెప్పారు. మీ దగ్గరకు వచ్చే సిబ్బందికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే అభిప్రాయాలు వెల్లడించాలన్నారు. జిల్లాలో ఎరువుల కొరతను అధిగమిస్తామని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధికంగా విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు కొమ్మలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ జనసేన కన్వీనరు నాగశ్రీను రాయల్, జిల్లా కార్యదర్శి నిశ్శంకి శ్రీనివాసరావు, ఆర్డీవో సరోజిని, డీఎల్‌డీవో వెంకటరెడ్డి, తహసీల్దారు నాగరాజు, జడ్పీటీసీ సభ్యురాలు హైమావతి పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీవీ, కలెక్టరు అరుణ్‌బాబు తదితరులు

ఎరువుల సమస్య ఏకరువు

పంచాయతీ కార్యాలయం వద్ద సభ జరుగుతుండగానే కొంతమంది రైతులు వచ్చి డీఏపీ ఎరువు అందుబాటులో లేదని, సొసైటీ గోదాం వద్దకు వెళితే నానో యూరియా, నానో డీఏపీ తీసుకుంటేనే డీఏపీ ఇస్తామని చెబుతున్నారన్నారు. మార్కెట్‌లో కంటే 20.20.0.15 ఎరువు అధిక ధరకు విక్రయిస్తున్నారని చెప్పారు. ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.100 అదనంగా తీసుకుంటున్నారని అయినా వ్యవసాయాధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

జిల్లాలో 158.4 మి.మీ. వర్షపాతం నమోదు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: మాచర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భారీ వర్షం కురిసింది దీంతో వాగులు పొంగి ప్రవహించాయి. పలుచోట్ల మెరుపులు, ఉరుములతో కూడిన వర్షానికి, గాలులకు విద్యుత్తు నిలిచి పోయింది. జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 158.4 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వెల్దుర్తిలో 49.2 మి.మీ, మాచర్ల 28.2 మి.మీ, దుర్గి 26.8 మి.మీ, రెంటచింతల 22.6 మి.మీ, పిడుగురాళ్ల 5.6 మి.మీ, రాజుపాలెం 10.8 మి.మీ, పెదకూరపాడు 5.0 మి.మీ వర్షం కురిసింది.

సులువైన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి: కలెక్టర్



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: రైతులు సులువైన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. మండలంలోని యల్లమంద గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ప్రారంభించారు. గ్రామ సమీపంలోని పత్తి పొలాలను లాం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించి పంట సాగు పద్ధతులు తెలుసుకొని రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పంటలు సాగు చేస్తే నష్టాలు రావన్నారు. వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతుల్లో చేసేందుకు అలవాటు చేసుకోవాలని, పూర్వం రోజుల్లో ఎకరా మందు పిచికారీకి 3 గంటల సమయం పట్టేదని, ఆధునిక టెక్నాలజీతో అదే మూడు గంటల్లో ఎక్కువ పొలంలో మందు పిచికారీ చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులను ఆదుకునేందుకు సబ్సిడీలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఆర్డీవో సరోజిని, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి అమలకుమారి, డ్రిప్ ఇరిగేషన్ పీడీ ఆంజనేయులు, లాం శాస్త్రవేత్త డయాన, రజనీ, ఎం.వెంకటరాములు, డాట్ సైంటిస్టు, శివకుమారి, వరలక్ష్మి, ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. జొన్నలగడ్డలోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

కారుతున్న జేఎన్టీయూ నూతన భవనం!

విద్యార్థులను వెంటాడుతున్న పాముల భయం



కురిసిన వానలకు ఆవరణలో నిలిచిన నీరు

జేఎన్టీయూ క్యాంపస్ నూతన భవనం ఇటీవల కురిసిన వర్షాలకు కారుతోందని కొన్ని చిత్రాలు ఆలస్యంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. అంతేకాకుండా క్యాంపస్ తరగతి గదుల్లోకి పాములొస్తున్నాయని కూడా వీడియోల్లో ఉంది. నరసరావుపేట మండలం కాకాని గ్రామ పంచాయతీ వద్ద జేఎన్టీయూ క్యాంపస్ భవనం ఐదేళ్లుగా నిర్మాణంలో ఉండి ఇప్పుడిప్పుడే తుదిదశకు చేరుకుంటోంది. గత సంవత్సరం ఇక్కడ తరగతి గదులు ప్రారంభించారు. నూతన భవనం అయినా వర్షానికి కురుస్తోందని కొన్ని వీడియోలు బయటకు వచ్చాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో కూడా కారుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. అంతేకాకుండా ఇటీవల ఓ విష సర్పం తరగతి గదిలోకి వచ్చిందని, పాముల సంచారంతో భయపడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపల్ శ్రీనివాసరావును వివరణ అడిగేందుకు ప్రయత్నించగా.. ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. **- ఈనాడు డిజిటల్, నరసరావుపేట**



జేఎన్టీయూ క్యాంపస్‌లో పాము

వరికెపూడిశెల పూర్తి చేయకపోతే రాయకీయాల్లో ఉండం

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



ముటుకూరులో మాట్లాడుతున్న శాసనసభ్యుడు బ్రహ్మారెడ్డి

దుర్గి, న్యూస్‌టుడే: పల్నాడు ప్రజల చిరకాల వాంఛ అయిన వరికెపూడిశెల ప్రాజెక్టు పూర్తి చేయకపోతే భవిష్యత్తులో రాయకీయాల్లో ఉండబోమని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముటుకూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెదేపా ప్రభుత్వం వరికెపూడిశెల ప్రాజెక్టు పనులను జనవరిలో ప్రారంభించి మొదటి దశలో త్వరలో పూర్తి చేస్తుందని, ఇప్పటికే రూ.14 కోట్లు అటవీ అనుమతులకు చెల్లించినట్లు పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వం వరికెపూడిశెల నుంచి నీళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతానని చెప్పి ఓట్ల కోసం వచ్చే ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ప్రస్తుతం పల్నాడు ప్రశాంతంగా ఉందని.. దీన్ని చెడగొట్టడానికి వైకాపా కార్యకర్తలు, నాయకులు ప్రయత్నిస్తే వారు ప్రతీకార చర్యలు కూడా చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సర్పంచి దొండపాటి వెన్నయ్య, ఎంపీపీ ఏఎంసీ సునీత, తెదేపా నాయకులు ఏఎంసీ సాంబశివ, బ్రహ్మయ్య, ఆనంతరామయ్య, పలు పురు మండల నాయకులు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

నరసరావుపేటసెంట్రల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలతో ఆరోగ్యంతో పాటు ఆదాయం చేకూరుతుందని డీపీఎం అమలకుమారి అన్నారు. మండలంలోని పెద్దరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలను ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిరంతరం ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసి లాభాలు పొందాలని రైతులకు సూచించారు. పెద్దరెడ్డిపాలెం, ఇసప్పాలెంలో సాగుచేసిన పంటలను ఆమె సందర్శించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, లైవ్ ధర - 148, డ్రెస్డ్ విత్ స్కిన్ - 215, స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: విజయవాడ బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 లైవ్ ధర 140 స్కిన్ విత్ స్కిన్ - 207, స్కిన్‌లెస్ - 238.
ఉభయ గోదావరి & వెస్ట్ ... బ్రాయిలర్ ఫారం లిఫ్ట్ ధర - 130, 139, 150 లైవ్ ధర ... స్కిన్ - 248 స్కిన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర: [illegible]

రెవెన్యూశాఖ భూమి అటవీశాఖకు బదలాయింపు

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: రెవెన్యూశాఖ మిగులు భూమిని అటవీశాఖకు బదలాయించింది. కొండవీడు కోట పార్కు కోసం గతంలో అటవీశాఖ తన భూమిని అప్పగించడంతో దానికి బదులు రెవెన్యూశాఖ అయ్యన్నపాలెం వద్ద సర్వే నంబరు 494లోని 22 ఎకరాలను కేటాయించింది. అప్పగించిన భూమికి వనసంరక్షణ సమితి తోడ్పాటుతో హద్దులు పాతినట్లు దోమల గుండం బీట్ అధికారి భాస్కర్ తెలిపారు.



బదలాయించిన భూమికి కంచె రాళ్లు పాతించిన అటవీశాఖ బీట్ అధికారి భాస్కర్

చిట్టి చేతులు.. పెద్ద సాయం



విద్యార్థులతో కలసి సీఎం చంద్రబాబునాయుడుకు చెక్కు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

పెదకూరపాడు, న్యూస్‌టుడే : అనుకోని ఆపదతో సర్వస్వం కోల్పోయి సాయం కోసం ఎదురు చూస్తున్న విజయవాడ పరిసర ప్రాంతాల వరద బాధితుల సహాయార్థం స్థానిక శ్రీకాకతీయ పాఠశాల విద్యార్థులు కదిలారు. తమ కిడ్డీ బ్యాంకుల్లో దాచుకున్న నగదుతో పాటు, తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయుల నుంచి విరాళాల రూపంలో రూ.5 లక్షలు పోగు చేశారు. దీనికి పాఠశాల యాజమాన్యం మరో రూ.లక్ష కలిపి మొత్తం రూ.6 లక్షల నగదు చెక్కును సీఎం చంద్రబాబుకు అందించారు. పాఠశాల యాజమాన్యం దివి లలితబాబు, శీలంనేని సాంబశివరావు లను సీఎం, విద్యాశాఖ మంత్రి లోకేశ్ అభినందించారు. ప్రిన్సిపల్ అశోక్, జనచైతన్య సమితి అధ్యక్షుడు దాసరి విజయ్ బెన్నిబాబు ఉన్నారు.

కాల్వల అక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

గారపాడులో సర్పంచి భర్తపై వైకాపా కార్యకర్తల దౌర్జన్యం

గారపాడు (పెదకూరపాడు), న్యూస్‌టుడే : మండలంలోని గారపాడులో వైకాపా నేతలు కాల్వలో పూడికతీత పనులను అడ్డుకొని మంగళవారం సర్పంచి భర్తపై దాడికి యత్నించారు. వారం రోజులుగా గ్రామంలో కాల్వల పూడికతీత పనులు చేస్తున్నారు. కాల్వల ఆక్రమణలు ఉంటే స్వచ్ఛందంగా తొలగించాలంటూ సర్పంచి మేడ రమణ గ్రామంలో దండోరా వేయించారు. మంగళవారం కాల్వలో పూడికతీతలో భాగంగా ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన బండలు తొలగించే క్రమంలో వైకాపా కార్యకర్తలు కందిమళ్ల గోపి, మద్దుకూరి వీరాంజనేయులు పారిశుద్ధ్య కార్మికులపై తిరగబడ్డారు. సర్పంచి భర్త కోటేశ్వరరావు అక్కడకు చేరుకొని వారించే ప్రయత్నం చేయగా నువ్వు సర్పంచివా.. నీ భార్యను తీసుకువస్తే బండలు తొలగిస్తామంటూ దౌర్జన్యానికి పాల్పడ్డారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించవద్దని ప్రశ్నిస్తే కులం పేరుతో దూషించి నెట్టి కింద పడేశారంటూ కోటేశ్వరరావు పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై బాలునాయక్ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ ఇవ్వండి

రైల్వే జీఎం, కేంద్ర మంత్రికి లేఖ పంపిన ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, న్యూస్‌టుడే : రాజధాని అమరావతికి అతి సమీపంలో ఉన్న పెదకూరపాడు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో 40 గ్రామాల పరిధిలో పదివేల మంది పైగా ప్రయాణికులు విద్య, వైద్యంకోసం దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంతో వ్యయ, ప్రయాసలు ఓర్చుకుంటున్నారని, పల్నాడుతో పాటు, రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెదకూరపాడులో నిలపాలని మంగళవారం రైల్వే జీఎం, కేంద్ర మంత్రి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ప్రవీణ్ లేఖ రాశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి

పిడుగురాళ్ల : గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని ఎంపీపీ గారపాటి అనసూర్య చెప్పారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పందిటివారిపాలెం సర్పంచి టి.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జూలకల్లులో పెట్టాలని ప్రతిపాదన చేసినా ఇంకా పట్టణంలో ఎందుకు కొనసాగిస్తున్నారని అడిగారు. దాంతోపాటు గ్రామానికి 15 రోజుల నుంచి విద్యుత్తు శాఖ జె.ఎల్.ఎం. రావటం లేదని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.కాశయ్య మాట్లాడుతూ జె.ఎల్.ఎం రాకపోతే అతనిపై ఫిర్యాదు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మండల ఉపాధ్యక్షుడు సాతులూరి బాబు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
మాచర్ల గ్రామీణ: 80085 73181 గురజాల: 80085 7 3176

? పట్టణంలోని ఐదోవార్డు పుట్టావారి వీధిలో రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఉంటున్నాయి. సగానికి పైబడి రోడ్డును వాహనాలతో ఆక్రమించడంతో నడకకు సైతం ఇబ్బందిగా ఉంది. **-స్థానికులు, ఐదో వార్డు**

✔ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందిని పంపి రోడ్డుపై రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న వాహనాలను తొలగిస్తాం.
-షమ్మి, మున్సిపల్ కమిషనర్, - సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ఉర్దూ పాఠశాలలో తరగతులు ప్రారంభం

కొండమోడు (రాజుపాలెం), న్యూస్‌టుడే : కొండమోడు పార్వతీపురంలోని ఉర్దూ పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయుడు గంగాధర్ తరగతులను పునః ప్రారంభించారు. 'అనుమతి లేకుండా పాఠశాల మూసివేత' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి విద్యాశాఖాధికారులు స్పందించారు. పాఠశాలలోనే తరగతులు నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వగా విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి, మధ్యాహ్న భోజనాన్ని అక్కడే అందించారు.

రైతు సుభిక్షం.. ప్రభుత్వ ఆశయం

సత్తెనపల్లి గ్రామీణ : రైతు సుభిక్షంగా ఉండాలనే ఆశయంతో వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సత్తెనపల్లి మండలం కంటెపూడిలో ఆయన మంగళవారం ప్రారంభించారు.

దుర్గి : వ్యవసాయ రంగంలో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మంచి దిగుబడులు సాధించాలని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి రైతులను కోరారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కోలగుట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. లాంఫాం శాస్త్రవేత్త రాజేష్ చౌదరి పాల్గొన్నారు.

అడ్డుకునేదెవరని ఆక్రమించారు

వెల్దుర్తిలో యథేచ్ఛగా పోరంబోకు భూమి ఆక్రమణ ★ నోటీసులు జారీ చేసిన పంచాయతీ

వెల్దుర్తి (అచ్చంపేట), న్యూస్‌టుడే : మండలంలోని వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని క్రోసూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద డొంక పోరంబోకు భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు, దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించేందుకు పంచాయతీ నిర్ణయించింది. 30 నుంచి 40 అడుగుల వెడల్పు ఉన్న స్థలాన్ని ఆక్రమించారని పంచాయతీ, సీఆర్‌డీఏ అనుమతులు లేకుండా భవనాలు, దుకాణాలు, సమీపంలోనే అక్రమ లేఅవుట్లు వెలిశాయి.


వెల్దుర్తి పంచాయతీ పరిధిలో డొంక పోరంబోకులో నిర్మించిన భవనాలు


వెల్దుర్తిలో రహదారి మార్జిన్‌లో నిర్మించిన దుకాణాలు

★ ఐదేళ్ల గ్రామ పంచాయతీ ఆ డొంక పోరంబోకు పొడవున ఉన్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలు, దుకాణాలను గుర్తించింది. గ్రామ సచివాలయం సర్వేయర్‌తో ఆక్రమణ స్థలాలను గుర్తించి మార్కింగ్ చేయించింది. వారికి గత నెలలో నోటీసులు జారీ చేశారు. కొందరు పంచాయతీ అనుమతి లేకుండా రెండు అంతస్తుల భవనాలు నిర్మించారు.

★ నాలుగు రోడ్లు కలిసే ప్రాంతంలో భూమి విలువ అధికంగా ఉంది. సమీపంలోని భూముల్లో అక్రమ లేవుట్లు వెలిశాయి. వాటికి పంచాయతీ లేదా సీఆర్‌డీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే లావాదేవీలు జరుపుతున్నారు. ఇందులో నిర్మించిన ఇళ్లలో కొందరు ఇంటి పన్నులు చెల్లించడం లేదని సమాచారం. వెంటనే ఆక్రమణలు తొలగించకుంటే లేదా క్రమబద్ధీకరణ చేసి ఆదాయ వనరులు పెంచుకునేందుకు పంచాయతీ, రెవెన్యూ పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

★ సర్వే నంబరు 538లో డొంక పోరంబోకు భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించేందుకు నోటీసులు జారీ చేసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచి జువ్వా శంకర్, పంచాయతీ కార్యదర్శి డి.వి.డి.ప్రసాదరావు తెలిపారు. ఆ ముదురు కాలువలు నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఉబికిన జలం


బోరు నుంచి వస్తున్న జలం

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని చర్లగుడిపాడు- జంగ మహేశ్వరపురంలోని ఓ రైతు పొలంలో బోరు వేయగా నీరు ఉబికి వస్తున్నాయి. మోటారు వేయకుండానే నీరు రావడంతో రైతులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

పత్తి క్షేత్రాలు సందర్శించిన రాష్ట్ర నోడల్ అధికారి

పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి, న్యూస్‌టుడే : పిడుగురాళ్ల సబ్ డివిజన్ పరిధిలో వివిధ గ్రామాల్లో సాగుచేస్తున్న అధిక సాంద్రత పత్తిసాగు క్షేత్రాలను స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ షీబా, దర్శి కృషి విజ్ఞాన్ కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ వెంకటరెడ్డి, పిడుగురాళ్ల ఏడీవో బి.కృష్ణదేవరాయలు సందర్శించారు. జానపాడు, బ్రాహ్మణపల్లి, శ్రీరుక్మిణీపురం, రామాపురం, దాచేపల్లి, ఇరికేపల్లిలో పత్తిపంటలు పరిశీలించారు. పత్తిసాగులో కాయ కుళ్లటం, పచ్చదోమ గమనించి, సస్య రక్షణ చర్యలు సూచించారు.

భారీ వర్షానికి నేలవాలిన వృక్షం

అమరావతి, న్యూస్‌టుడే : అమరావతిలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి రహదారులు నీటిమయంగా మారాయి. ధరణికోటలో వృక్షం నేల వాలింది. క్రోసూరు రహదారిపై నేలవాలడంతో మార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మత్తాయపాలెం వాగు ఉప్పొంగి కొద్దిసేపు రాకపోకలు నిలిచాయి.


ధరణికోటలో కూలిన చెట్టు

మున్సిపల్ డీఈగా వెంకటరమణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : మున్సిపల్ డీఈగా టి.వెంకటరమణ నియమితులయ్యారు. చిలకలూరిపేట నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ డీఈ మధుసూదనరావు గుంటూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా టీపీఎస్‌లుగా సునీత, రిజ్వానా నియమితులయ్యారు. సునీత మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన టీపీఎస్ రాఘవరావు పొన్నూరుకు బదిలీ అయ్యారు. ఏఈగా ఎం.స్వర్ణరాజు నియమితులయ్యారు. ఆయన నరసరావుపేట నుంచి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. చాలాకాలంగా ఖాళీగా ఉన్న రెండో ఏఈ పోస్టు ఆయనతో ఉన్నతాధికారులు భర్తీ చేశారు.

లోతుకు వెళితే ప్రమాదమే


కంచె లేక లోతుకు వెళ్లి స్నానాలు చేస్తున్న భక్తులు

అమరావతి, న్యూస్‌టుడే : అమరావతి అమరేశ్వరాలయంలో భక్తులు పుణ్య స్నానాలకు అమరేశ్వర ఘాట్‌లో లోతుకు వెళ్లి చేస్తున్నారు. గతంలో నీరు తక్కువగా ఉండటంతో రక్షణ చర్యలుతో పెద్దగా అవసరం ఉండేవి కాదు. ఇప్పుడు ప్రవాహం ఎక్కువగా ఉంది. కనుక భక్తులకు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

గుంతల్లో ఊగుతూ వెళ్లాల్సిందే

దాచేపల్లి న్యూస్‌టుడే : కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలకు నడికుడి నుంచి అలుగుమల్లిపాడు మీదుగా తక్కెళ్లపాడు వెళ్లే రహదారి కోతకు గురైంది. గుంతలతో అధ్వానంగా మారింది. ఈ మార్గంలో తెల్లరాయి క్వారీలు ఉండటంతో అటువైపుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు కోతకు గురి కాగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.


కోతకు గురైన అలుగుమల్లిపాడు రోడ్డు చిత్రం

రిజర్వేషన్లపై తొలగిన కాంగ్రెస్ ముసుగు


నిరసన ప్రదర్శన చేస్తున్న భాజపా నేతలు

అమరావతి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లపై ముసుగు తొలగిందని.. అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తామంటూ ఆపార్టీ అగ్రనేత నేత రాహుల్ గాంధీ ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భాజపా జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. మంగళవారం అమరావతిలోని రాహుల్‌గాంధీ రిజర్వేషన్ల పట్ల చేసిన వ్యాఖ్యలపై నిరసన చేపట్టారు. సుధాకర్‌బాబు మాట్లాడుతూ ఒక బీసీ వ్యక్తి ప్రధానమంత్రిగా ఉంటే.. ఓర్చుకోలేని రాహుల్ గాంధీ రిజర్వేషన్లపై చౌకబారుగా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలపై మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు ఆందోళన చెందుతున్నట్లు పేర్కొన్నారు. భాజపా నేతలు పూర్ణచంద్రరావు, రవిశంకర్, వెంకటేశ్వరరావు, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ భూములపై విచారణ చేయండి

మాచవరం, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేయించుకుని, పంట రుణాల కింద రూ.కోట్లు తీసుకున్నారని పిల్లుట్ల సర్పంచి లఘమవరపు శివపార్వతి భర్త సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలు చెల్లించకుండా, బ్యాంకులు, సొసైటీలను మోసం చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు సమస్యలు ప్రస్తావించారు. చివరగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు ప్రతిజ్ఞ చేశారు. సమావేశానికి ఎంపీపీ దారం అంబులమ్మ, వైస్ ఎంపీపీ చల్లగుండ్ల లక్ష్మయ్య, జడ్పీటీసీ సభ్యుడు వెంకటశివయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు హాజరయ్యారు.


స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేస్తున్న సభ్యులు

సందడిగా క్రీడా పోటీలకు ఎంపికలు

అచ్చంపేట, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పూర్వ గుంటూరు జిల్లా స్థాయి అండర్- 19 విభాగం బాలుర, బాలికల జట్ల ఎంపిక పోటీలు మంగళవారం స్థానిక బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేపట్టినట్లు ఎస్.జి.ఎఫ్. పూర్వ కార్యదర్శి, విశ్రాంత పి.డి జి.భూషణం తెలిపారు. వీరంతా అక్టోబరు 3, 4, 5 తేదీల్లో విజయవాడ వద్ద గల నున్నలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు చెప్పారు. పాఠశాల ప్రిన్సిపల్ టి.అరుణకుమార్, ఎస్.జి.ఎఫ్ కార్యదర్శి జి.నరసింహారావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి : స్కూల్‌గేమ్స్ మండల స్థాయి పోటీల్లో రాణించి స్థానిక హోలీ ఫ్యామిలీ పాఠశాల విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్‌లో లోకేశ్, అభి, కబడ్డీలో నితీష్‌కుమార్, శివరామ్, భార్గవ్, మోహన్ నవీన్, షటిల్‌లో ఐశ్వర్య, బాలసమీక్ష, చెస్‌లో చైతన్యరామ్, నాగవెంకట్, దివ్యసుధ, నిక్షిత, అథ్లెటిక్స్‌లో అపూర్వ వీరిలో ఉన్నారు. సిస్టర్లు విజయరాణి, అరుణజ్యోతి, వ్యాయామోపాధ్యాయుడు అచ్చిరెడ్డి తదితరులు వీరిని అభినందించారు.

సత్తెనపల్లి : స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అండర్- 14, 17 కబడ్డీ, ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. అన్ని క్రీడా పోటీల్లో బహుమతులు గెల్చుకున్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థినులను హెచ్‌ఎం మాధవీలత, పీడీలు సునీత, గోవిందమ్మ, శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్షం.. పలు ప్రాంతాలు జలమయం


వర్షంతో ఊపిరి పోసుకున్న మిరప మొక్కలు

పెదకూరపాడు : వరుణుడి జాడ కోసం 15 రోజులుగా ఎదురుచూస్తున్న అన్నదాతలకు మంగళవారం కురిసిన భారీ వర్షం ఊపిరి పోసింది. విత్తనానికి, మొలకలకు జీవం పోసినట్లయింది. భారీ వర్షంతో సత్తెనపల్లి- అమరావతి కాలచక్ర రహదారి, పరస నుంచి గుంటూరు, పెదకూరపాడు నుంచి గుంటూరు వెళ్లే మార్గాల్లోని లోతట్టు చప్టాలపై వర్షపునీరు ప్రవహించటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


75త్యాళ్లూరు గ్రామంలో లోతట్టు చప్టాపై వరద ప్రవాహంతో నిలిచిపోయిన రవాణా

మాచర్ల (కారంపూడి) : చంద్రవంక వాగు సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో మాచర్ల- జమ్మలమడక గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. మున్సిపల్ ఛైర్మన్ పోలూరి నరసింహారావు సిబ్బందితో కలిసి వెళ్లి నీటి ప్రవాహంలోకి ఎవరూ రాకుండా పహారా ఏర్పాటు చేశారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న పిచ్చి చెట్లను తొలగించారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ.. సత్కారాలు

పెదకూరపాడు : పెదకూరపాడు మండల అభివృద్ధి అధికారిగా రామకృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

ముప్పాళ్ల : ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన పీజే విలియమ్స్‌ను మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సత్కరించారు. నూతన ఎంపీడీవో గ్రామాల్లో పౌర సేవల నిర్వహణపై కార్యదర్శులతో చర్చించారు. ఈవోపీఆర్‌డీ రూపవతి, సిబ్బంది పాల్గొన్నారు.

మాచవరం : మాచవరం ఎంపీడీవోగా పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. హైకోర్టులోని ఒక సెక్షన్‌లో పనిచేస్తూ బదిలీపై ఈయన ఇక్కడకు వచ్చారు. మంగళవారం కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు.

దాచేపల్లి : ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై రేపల్లె వెళుతున్న శోభారాణిని ఎంపీపీ కందుల జాన్, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సత్కరించారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన ఎంపీడీవో పి.రామకృష్ణను సత్కరించారు.

అమరావతి : అమరావతి ఎంపీడీవోగా టి.పార్వతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఉమాదేవి కారంపూడి వెళ్లారు.

'జగన్‌కు ఓటేసి గౌరవం తగ్గించుకున్నాం'


ధూళిపాళ్లలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే : ఒక్క అవకాశమంటూ 2019లో అడిగిన జగన్‌కు ఓటేసి మన గౌరవం తగ్గించుకున్నాం.. ఆయన అధికారం చేపట్టి ఆస్తులు పెంచుకున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. గృహ యజమానుల అంగీకారంతో గోడలకు స్టిక్కర్లు అంటించారు. రూ.10 లక్షల అంచనాలతో చేపట్టనున్న సిమెంటు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సచివాలయం వద్ద స్వర్ణాంధ్ర- 2047 బ్రోచర్ ఆవిష్కరించారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు, నాయకులు ఆళ్ల అమరేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, మండడి కాళీప్రసాద్, తహసీల్దారు శ్రీనివాస చక్రవర్తి, ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈ సుబ్బారావు, ప్రభుత్వ సిబ్బంది, పలువురు నేతలు పాల్గొన్నారు.

పరస (పెదకూరపాడు) : పరస గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు, సరిపూడి కృష్ణకుమారి, గంగాధరరావు పాల్గొన్నారు.


100 రోజుల కరపత్రాలు ప్రదర్శిస్తున్న కుమారి తదితరులు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

బెల్లంకొండ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా ..ప్రజలకు చేసిన మేలు తెలియజేస్తున్నామని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ అన్నారు. పాపాయపాలెం, బెల్లంకొండ గ్రామాల్లో తెదేపా రాష్ట్ర సీనియర్ నాయకులు, గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, రాష్ట్ర తెదేపా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్‌తో కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. బెల్లంకొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచి గడ్డిపర్తి జ్యోతి సముద్రం, నల్లమేకల లక్ష్మినారాయణ, తమ్మిశెట్టి సత్యనారాయణ. వెన్నా సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, నాయకులు

పిడుగురాళ్ల, : పట్టణంలోని 8, 10, 11, 12వ వార్డులకు చెందిన ప్రజలకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని తెదేపా, జనసేన నేతలు మంగళవారం నిర్వహించారు. వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెదేపా నేతలు పి.రవికుమార్, ఎస్‌డీ అమీర్‌అలీ, శ్రీనివాసరావు, పి.చెన్నారావు, వి.సాంబశివరావు, వి.రామకృష్ణ, జనసేననేత కె.రమేష్ వివరించారు. సచివాలయ సిబ్బందితో కలిసి కరపత్రాలు అందజేశారు.

అవీ ఇవీ

పవన్ కల్యాణ్ దీక్షకు సంఘీభావంగా హోమం

గురజాల గ్రామీణ : గత వైకాపా ప్రభుత్వ హయాంలో పాలకుల తమ స్వార్థం కోసం ఆలయాల పవిత్రత దెబ్బతీసేలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా గురజాల పట్టణంలోని పాత పాటమ్మ ఆలయ ఆవరణలో శాంతిహోమం నిర్వహించారు. జనసేన సమన్వయకర్త కటకం అంకరావు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి హోమం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టభద్ర ఎన్నికల్లో సత్తా చాటుదాం..

సత్తెనపల్లి : త్వరలో జరిగే గుంటూరు- కృష్ణా పట్టభద్ర ఎన్నికల్లో సత్తా చాటుదామని వైకాపా నాయకుడు, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ నాయకుడు చిట్టా విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్ర ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా తాను బరిలో నిలబడుతున్నానని, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అండగా నిలిచి గెలిపించాలని గౌతమ్‌రెడ్డి కోరారు.

రచనా రంగంలో కీర్తి శిఖరం గుర్రం జాషువా

పిడుగురాళ్ల : రచనా రంగంలో కీర్తి శిఖరం గుర్రం జాషువా అని విశ్రాంత న్యాయమూర్తి కూచిపూడి ప్రసాదరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని కార్డ్స్ పాఠశాలలో జాషువా 129వ జయంతి కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడుతూ దేశంలో కుల వివక్షపై తన కలాన్ని కత్తిగా చేసుకొని చీల్చి చెండాడిన మహాకవి జాషువా అని చెప్పారు. న్యాయవాది రూత్ బనియన్ మాట్లాడుతూ జిల్లాలో కవి చక్రవర్తి జాషువా పుట్టడం మన జిల్లాకు గర్వకారణమని చెప్పారు. కార్డ్స్ సంస్థ డిప్యూటీ డైరెక్టరు టి.అమర్నాథ్, రాజకుమారి, విజయ్‌కుమార్, సంతోషరావు, అబ్రహాం, స్వర్ణలత, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

మాచర్ల (కారంపూడి) : మాచర్ల నియోజకవర్గ స్థాయి ఖోఖో క్రీడా పోటీలను మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రారంభించారు. స్థానిక బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు అనంతశివ, వ్యాయామ ఉపాధ్యాయుల జిల్లా ప్రధాన కార్యదర్శి సువర్ణరాజు, వున్నం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో అన్నదానం

గురజాల గ్రామీణ : పట్టణంలోని అమ్మవారి ఆలయంలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు, భక్తులకు అన్నదానం చేశారు. కటికం అంకారావు, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

పిడుగురాళ్ల : పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయిలో ఎస్.జి.ఎఫ్. పోటీలను మంగళవారం నిర్వహించారు. పోటీల్లో ఆక్స్‌ఫర్డు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.నరేష్ తెలిపారు.

స్వచ్ఛతా హీ సేవా

దుర్గి : మండల పరిధిలోని ఓబులేశునపల్లె కోట సైదయ్య జడ్పీ పాఠశాలలో మంగళవారం అడిగొప్పల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు మేనేజరు వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల పాఠశాల తనిఖీ

క్రోసూరు (అచ్చంపేట) : క్రోసూరు కస్తూర్బా బాలికల పాఠశాలను మంగళవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానటరింగ్ కమిటీ సభ్యుడు జి.దాస్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

29న ఉచిత వైద్య శిబిరం

పాటిబండ్ల (పెదకూరపాడు) : పాటిబండ్ల ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఆదివారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్నారై భానుప్రకాష్ మంగళవారం తెలిపారు. శిబిరంలో గుంటూరు కాటూరి మెడికల్ కళాశాల వైద్యులు పాల్గొని ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని చెప్పారు.

రాత పుస్తకాలు, పెన్నుల పంపిణీ

దాచేపల్లి : దాచేపల్లి పట్టణంలోని అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమారిటన్ సేవాసంస్థ ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు జి.బుల్లయ్య, 14వ వార్డు సభ్యుడు వట్టేపు సుందరరావు, ప్రధానోపాధ్యాయుడు సుధీర్ లింకన్ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదంలో కూలీ మృతి

నకరికల్లు, న్యూస్‌టుడే : రహదారి ప్రమాదంలో కూలీ మృతి చెందాడు. నకరికల్లుకు చెందిన కేలం రామకృష్ణ (41) పిడుగురాళ్లలోని గోతాల మిల్లులో దినసరి కూలీ. సోమవారం పనికి వెళ్లి తిరిగి మంగళవారం తెల్లవారుజామున గ్రామానికి చేరుకొని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నరసరావుపేట

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

రైతుల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: భూ రికార్డుల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీడీఎం నేతలు ఎమ్మెల్యే అరవిందబాబుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దు చేసినా రైతులకు ప్రయోజనం లేదని తెలిపారు. రీసర్వే ఎల్పీ నంబర్లను రద్దు చేయాలన్నారు. జొన్నలగడ్డ సర్వేయర్ రామాంజనేయులు అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రీసర్వే, ఎల్పీ నంబర్ల రద్దుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నేతలు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, రామారావు తదితరులున్నారు.

మరమ్మతులు చేశారు.. మార్గం తెరిచారు

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: నరసరావుపేట పట్టణం ప్రకాష్ నగర్‌లో కల్వర్టు మ్యాన్ హోల్‌కు దెబ్బతిన్న చోట కొత్త ఇనుప చట్రాన్ని బిగించారు. ఈ మార్గాన్ని మూసివేసిన తీరుపై 'ఈనాడు'లో 'మరమ్మతులు చేయకుండా.. మార్గమే మూసేశారు..' శీర్షికతో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు.

వేలాడుతున్న విద్యుత్తు తీగల తొలగింపు

అమీన్‌సాహెబ్‌పాలెం (నాదెండ్ల), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం అమీన్‌సాహెబ్ పాలెం ఎస్టీ కాలనీ గృహాలపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్తు తీగలను ఆ శాఖ అధికారులు తొలగించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు లైన్ వేలాడుతూ ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.

స్పందనకు వందనం

దీనిపై 'ఈనాడు'లో సోమవారం 'ప్రాణాలతో చెలగాటం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఇందుకు చిలకలూరిపేట ఏడీఈ అశోక్‌కుమార్, నాదెండ్ల ఏఈ ప్రసాద్ స్పందించారు. సిబ్బందితో దీన్ని పునర్ వ్యవస్థీకరించారు. స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్తు తీగలను పైకి బిగించారు. ప్రజలకు ప్రమాదం లేకుండా చర్య తీసుకున్నారు. ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

అదుపు తప్పి పల్టీ కొట్టిన లారీ

రొంపిచర్ల: అద్దంకి- నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి పరిధిలోని తంగేడుమల్లి మేజర్ కాలువ సమీపంలో మంగళవారం లారీ అదుపు తప్పి పొలంలోకి పల్టీకొట్టింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పగాయాలతో బయట పడ్డారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ లయోల పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరచి 13 మంది ఎంపికైనట్లు నాగులవరం జడ్పీ పాఠశాల హెచ్ఎం షన్మోహనరావు తెలిపారు. అండర్ 17 విభాగంలో బాలురు కబడ్డీలో నలుగురు, అండర్ 14లో ఇద్దరు, బాలికల్లో అండర్ 17లో వాలీబాల్లో ముగ్గురు, అండర్ 14 విభాగంలో నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు.

కబడ్డీ పోటీలకు..

నూజండ్ల, న్యూస్‌టుడే: నూజండ్ల సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కామేశ్వరశర్మ తెలిపారు. అండర్-17 బాలికల కబడ్డీ పోటీలకు గోపిశెట్టి లక్ష్మి ప్రసన్న, దూపాటి శ్రావణి ఎంపిక కాగా అండర్-14 విభాగంలో గుమ్మ లోకేశ్వరి, బాలుర విభాగంలో బొడ్డపాటి ప్రవీణ్‌కుమార్ జిల్లా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు విజయ్ పేర్కొన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీల్లో..

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడా పోటీలను అమీన్‌సాహెబ్‌పాలెం జడ్పీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగంలో చెస్, యోగ పోటీల్లో విజేతలను నియోజవర్గ జట్టుకు ఎంపిక చేశారు. విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట గ్రామీణ: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా జనసేన నేతలు బోప్పూడి ప్రసన్నాంజనేయ ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. నేతలు రాజారమేష్, బ్రహ్మస్వాములు, సుభాని, హసన్, ఖాదర్‌బాషా, తదితరులున్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

చెకుముకి ప్రతిభ పోటీలు

శావల్యాపురం, న్యూస్‌టుడే: జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి పాఠశాల స్థాయి చెకుముకి ప్రతిభ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల జన విజ్ఞానవేదిక సభ్యుడు బోయపాటి త్రివిక్రమ్ తెలిపారు. పాఠశాలస్థాయిలో విద్యార్థులు వ్యక్తిగతంగా పాల్గొంటారని, ప్రతి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులను బృందంగా మండల స్థాయి పోటీలకు పంపుతామని చెప్పారు. అక్టోబరు 1న మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అక్టోబరు 27 జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.


ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న ఐటీసీ, సెర్ప్ సంస్థల ప్రతినిధులు

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

నూజండ్ల: ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ముప్పని ఐటీసీ, సెర్ప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జంగాలపల్లెలో పాఠశాల విద్యార్థులతో కలిసి వారు ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ నష్టాలను ప్రజలకు వివరించారు. విద్యార్థులు మానవహారంగా ఏర్పడి స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు పక్కన ఉన్న ప్లాస్టిక్ తొలగించారు. కంచర్ల సుబ్బ రామయ్య, సందీప్, కరిముల్లా తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మల్లమ్మ సెంటర్ (నరసరావుపేట) : 6300021363
చిలకలూరిపేట గ్రామీణ : 8008883217 శావల్యాపురం : 8008573165

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట):

? నరసరావుపేట ప్రకాష్‌నగర్ గంగమ్మతల్లి వీధిలో వీధి దీపం వెలగడం లేదు. -రజని, సానికులాలు

✔ సిబ్బందికి తెలియజేసి కొత్త దీపం అమర్చి సమస్య లేకుండా చూస్తాం. -శేఖర్, వీధి దీపాల పర్యవేక్షణాధికారి, నరసరావుపేట

నరసరావుపేట టౌన్, న్యూస్‌టుడే: ? కిడ్స్ బొమ్మ కూడలి నుంచి కుసుమహరినాథ దేవాలయం, ఖాత్ మార్కెట్ వైపు వెళ్లే రహదారి తోపుడు బండ్లతో కుంచించుకుపోతోంది. -హరినాథ్, నరసరావుపేట పట్టణం

✔ రహదారిని ఆక్రమించి తోపుడు బండ్లు పెడితే చర్యలు తీసుకుంటాం. సంచార వాహన పోలీసు సిబ్బందితో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ పర్యవేక్షిస్తాం. -రమేష్, ట్రాఫిక్ సీఐ, నరసరావుపేట పట్టణం

? నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మరుగు దొడ్ల నిర్వహణ సక్రమంగా లేదు. - బొడ్డపాటి రాజా, యలమంద

✔ బహిరంగ మూత్రవిసర్జన చేయకుండా పర్యవేక్షిస్తాం. ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుతాం. - బత్తుల వీరాస్వామి, డీఎం

రొంపిచర్ల, న్యూస్‌టుడే: ? అన్నవరం ప్రభుత్వ మద్యం దుకాణం ముందు రోడ్డుపై మురుగు నిలుస్తోంది. -శ్రీనివాసరావు, వాహనదారుడు

✔ మురుగు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకుని సమస్య పరిష్కరిస్తాం. -శివరామకృష్ణ, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, అన్నవరం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే:? బీసీ కాలనీ సమీపంలో 34వ వార్డు రామానగర్‌లో మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. -భార్గవి, రమ్యశ్రీ

✔ సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. - శానిటరీ అధికారి

భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ సేవలేవి!

ప్రత్యేక అవసరాల పిల్లలకు అవస్థలు

న్యూస్‌టుడే, వినుకొండ, నరసరావుపేట వ్యవసాయం

బిడ్డ పుట్టగానే ఆ ఇంట్లో ఆనందానికి అవధులుండవు. శిశువు బోసి నవ్వులతో ఇల్లంతా సందడే. అదే అవయవాలు సరిగా లేకున్నా.. బుద్ధిమాంద్యం ఉన్నా తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. అలాంటి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రాలు భరోసా ఇవ్వలేకపోతున్నాయి. కేంద్రాల్లో సరిపడా వైద్యులు లేక ఫిజియోథెరపీ సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రాల్లో ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ పేరుతో వివిధ అంశాల్లో తర్ఫీదు ఇవ్వడంతో పాటు ఫిజియోథెరపీ సేవలందిస్తుంటారు. ఈవిద్యా సంవత్సరంలో కేంద్రాలు పునః ప్రారంభం నాటికి సహిత విద్య ఉపాధ్యాయులను (ఐఈఆర్టీలు) నియమించిన అధికారులు ఫిజియోథెరపీ వైద్యులను మరిచారు. పల్నాడు జిల్లాలో 28 మండలాల్లో వీరి సేవలందించడం లేదు. మూడు నెలల క్రితం దరఖాస్తులు ఆహ్వానించిన సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారులు నియామకాలు ఇప్పటి వరకు చేపట్టలేదు. జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 28 భవిత కేంద్రాలున్నాయి. ప్రతిచోటా ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక ఆయాను నియమించారు. ఒక్కొక్కరు పదిమంది బాధ్యత తీసుకుని విద్యతో పాటు వివిధ అంశాల్లో పిల్లలకు తర్ఫీదు ఇస్తున్నారు. వారంలో ఒక రోజు వారి ఇళ్లకు వెళ్లి జీవన నైపుణ్యాలు నేర్పుతారు. అవసరమైన వారిని భవిత కేంద్రంలో చేర్చుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. అయితే సరిపడా బడ్జెట్ కేటాయింపులు, పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం, ఇతర సమస్యలతో సేవలు దూరమవుతున్నాయి.

సరిపడా వైద్యులు లేక..

జిల్లాలో 28 భవిత కేంద్రాలకు 10 మంది ఫిజియోథెరపీ వైద్యులుకాగా ఐదుగురే సేవలు అందిస్తున్నారు. వినుకొండ నియోజకవర్గంలోని నూజండ్ల, ఈపూరు,


రొంపిచర్ల భవిత కేంద్రంలో చిన్నారులకు శిక్షణ


వినుకొండ భవిత కేంద్రంలో బాలుడికి ఫిజియోథెరపీ సేవలు (పాత చిత్రం)

శావల్యాపురం, వినుకొండ మండలాలకు మూడు నెలలుగా వైద్యులు లేక ఫిజియోథెరపీ సేవలు నిలిచిపోయాయి. రొంపిచర్ల మండలంలో రెండేళ్ల నుంచి ఫిజియోథెరపిస్టు లేరు. ప్రత్యేక అవసరాల చిన్నారులకు సేవలు అందటం లేదు. ప్రస్తుతం 13 మంది చిన్నారులకు సహిత విద్య బోధకులే ఆయా సేవలు అందించాల్సిన పరిస్థితి. జిల్లాలోని మరికొన్ని మండలాల్లోనూ ఇదే దుస్థితి. ఖాళీ పోస్టుల భర్తీకి సర్వశిక్ష అభియాన్ మూడునెలల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసినా ఇప్పటి వరకు వాటిని భర్తీ చేయలేదు. సమస్యపై భవిత కేంద్రాల జిల్లా సమన్వయకర్త ఆర్. సెల్వరాజ్ మాట్లాడుతూ ఫిజియోథెరపి వైద్యుల నియామకానికి నోటిపికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారు. ఇంటర్వ్యూలు నిర్వహించి త్వరలో నియామకాలు చేపట్టి పూర్తిస్థాయిలో సేవలు అందిస్తామని చెప్పారు.

ఫాగింగ్ లేక... దోమల బెడద తొలగక

జ్వరాల బారిన జనం

న్యూస్‌టుడే, నరసరావుపేటసెంట్రల్

ఇటీవల వర్షాలకు పట్టణంలో దోమల ఉద్ధృతి పెరిగింది. జ్వరాలు ప్రబలుతున్నాయి. రోగులతో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. వాటి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో పట్టణంలో సమస్య అధికంగా ఉంది. ఫాగింగ్, దోమల మందు పిచికారీ వంటివి చేసిన దాఖలాలు కనిపించడంలేదు. యంత్రాలున్నా నిరుపయోగంగా మారాయి. నరసరావుపేట మున్సిపాలిటీలో 34 వార్డుల్లో 1.50 లక్షల జనాభా ఉంది. దోమల సమస్యతో అధిక శాతం మంది ఇబ్బంది పడుతున్నారు.

మురుగు కదలక..

2014-19 తెదేపా ప్రభుత్వ హయాంలో దోమలను నివారించేందుకు వార్డుకు ఒక హ్యాండ్ ఫాగింగ్ మిషను కొనుగోలు చేసి దోమలపై దండయాత్ర కార్యక్రమం చేపట్టి ప్రజలను దోమల నుంచి రక్షణ కల్పించారు. దోమల మందు పిచికారీతో పాటు రాత్రిళ్లు ప్రతి వార్డులో ఫాగింగ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వం వీటిని విస్మరించింది. మురుగు కాలువల్లో మురుగు సైతం తొలగించలేదు. ప్రస్తుతం కూడా


వినియోగించని మెగా ఫాగింగ్ మిషన్

చాలాచోట్ల కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు.

యంత్రాలున్నా నిరుపయోగం

దోమల నివారణకు అవసరమైన యంత్రాలున్నా అధికారులు వాటిని ఉపయోగించడం లేదు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో నాలుగు హ్యాండ్ ఫాగింగ్, ఒక మెగా ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. హ్యాండ్ స్ప్రే మిషన్లు-34 ఉన్నాయి. వీటిని నిరుపయోగంగా ఉంచడంతో పట్టణంలో దోమల ఉద్ధృతి అధికంగా ఉంటోంది. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఇటీవల హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు 26 కొత్తవి కొనుగోలు చేశారు. అయితే వాటిని వినియోగించడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని, ఇతర యంత్రాలు వినియోగించి సమస్య లేకుండా చూస్తామని చెప్పారు.



తలకిందులుగా చదవాల్సిందే

అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిలో అనేక చోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వినుకొండ అర్‌అండ్‌బీ శాఖ కార్యాలయం వద్ద ఉన్న బోర్డు తల్లకిందులుగా ఉంది.

–న్యూస్‌టుడే, వినుకొండ

ఆరోగ్య కేంద్రం తనిఖీ

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నెట్‌వర్క్ వైద్యశాలలు, ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు, భోజనం అందిస్తారని ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, వైద్యమిత్ర మాచర్ల బుజ్జి, టీం లీడర్ ప్రశాంతి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

‘పొలం పిలుస్తోంది’ సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం, న్యూస్‌టుడే: రైతులకు ఉపయుక్తంగా కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని వేల్పూరు, శావల్యాపురంలో కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన అధికారి షేక్ రసూల్ మాట్లాడుతూ పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందజేస్తుందన్నారు. రాయితీపై బిందు, తుంపర సేద్యం, లింకుపైపులు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది అశోక, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు


తాతపూడిలో క్షేత్రస్థాయిలో రైతులకు సూచనలిస్తున్న ఏవో శ్రీలత

చిలకలూరిపేటగ్రామీణ, న్యూస్‌టుడే: తాతపూడి గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పత్తిపంటలో తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను ఏవో శ్రీలత వివరించారు. అనంతరం పంచాయతీ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భూసార పరీక్షల ఉపయోగాలు, పంటల ఆవశ్యకత, వివిధ పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు.


పూజలు నిర్వహిస్తున్న జనసేన నేతలు

పవన్ కల్యాణ్ దీక్షకు మద్దతుగా ప్రత్యేక పూజలు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మంగళవారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తెదేపా, జనసేన నేతలు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే అరవిందబాబు, జనసేన నేతలు సయ్యద్ జిలానీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనం.. భయం భయం



వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలోని పీపీ యూనిట్ భవనం పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులూడిపడుతోంది. భయాందోళన మధ్య విధులు నిర్వహించాల్సి వస్తుందని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ప్రమాదం జరగకముందే ఉన్నతాధికారులు స్పందించాలని సిబ్బంది కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, వినుకొండ గ్రామీణ**

ఇరుకుదారుల్లో ట్రాఫిక్ కష్టాలు


యల్లయ్య, పోలయ్య హోటల్‌కు వెళ్లే మార్గంలో..


చలివేంద్రం బజారులో..

చిలకలూరిపేటలో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పటం లేదు. ప్రధానంగా మెయిన్ బజార్, మార్కెట్ సెంటర్, చలివేంద్రం బజార్, మద్దిమల్లయ్య వీధి, యల్లయ్య, పోలయ్య హోటల్ బజార్, కళామందిర్ నుంచి చీరాల వెళ్లే మార్గంలో మలుపు చౌత్రా సెంటర్ ప్రాంతాలలో సాయంత్రం వేళ నడవటానికి కూడా వీలుపడడం లేదు. రోడ్లపై అల్పాహార బండ్లు, తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాల నిలుపుదలతో ట్రాఫిక్ రద్దీ ఉంటోంది.

- **న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ**

అసంపూర్తిగా తరగతి గదులు



నూజండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. తెదేపా ప్రభుత్వ హయాంలో 2016-17లో రూర్బన్ పథకం కింద అదనపు తరగతి గదులు కోసం రూ.60 లక్షల నిధులు కేటాయించి పనులు చేపట్టారు. తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. అదనపు తరగతి గదుల నిర్మాణం ఏళ్లుగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. - **న్యూస్‌టుడే, నూజండ్ల**

మొరాయించిన బండి



నరసరావుపేట పట్టణానికి వస్తున్న ఓ మినీ వాహనం మరమ్మతులకు గురవడంతో దాన్ని మరో వాహనానికి తాడుతో కట్టి పల్నాడు రోడ్డులో నుంచి మెకానిక్ షెడ్డుకు తరలిస్తున్నారు. మార్గమధ్యలో తాడు తెగిపోతే వెనుక వచ్చే వాహనాలు ఒక్కసారిగా ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - **న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్**

భూములపై విచారణ చేయండి

మాచవరం: వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో అక్రమంగా నమోదు చేయించుకుని, పంట రుణాల కింద రూ.కోట్లు తీసుకున్నారని పిల్లుట్ల సర్పంచి శివపార్వతి భర్త సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తీసుకున్న రుణాలు చెల్లించకుండా, బ్యాంకులు, సొసైటీలను మోసం చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పలు సమస్యలు ప్రస్తావించారు. చివరగా స్వచ్ఛతా హీ సేవలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, నేతలు ప్రతిజ్ఞ చేశారు.

గ్రామాల్లో ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల అభివృద్ధిపై అధికారులు, నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం, యడ్లపాడు మండలంలోని చెంఘీస్‌ఖాన్‌పేట, పట్టణంలోని 10వార్డులో కూటమి ప్రభుత్వం వంద రోజుల అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. గోడపత్రికలు ఆవిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచి దేవదానం, నేతలు మదన్, ఉమామహేశ్వరరావు, చందు, అజారుద్దీన్, దరియావలి, తదితరులున్నారు.


కోమటినేనివారిపాలెంలో కరపత్రాల పంపిణీలో అధికారులు, నేతలు

ఆపదలో ఆపన్నహస్తం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మానుకొండవారిపాలెం తెదేపా నేతలు రూ.లక్ష, అశోక కాఫీపొడి అధినేత మున్నలూరి కుమారస్వామి రూ.లక్ష విరాళం అందజేశారు. అందుకు సంబంధించిన చెక్కులు మంగళవారం ఎమ్మెల్యే పుల్లారావుకు అందజేశారు.

-న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ





విద్యార్థుల చేయూత

వరదబాధితుల సహాయార్థం సేకరించిన విరాళం రూ.80,200 చెక్కును కలెక్టర్‌కు అందజేస్తున్న యలమంద జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులు

–న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

ఎంపీడీవోగా కృష్ణకుమారి

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: నరసరావుపేట ఎంపీడీవోగా కె.వి కృష్ణకుమారిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రకాశం జిల్లాలో పనిచేస్తూ బదిలీపై ఆమె నరసరావుపేటకు రానున్నారు. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వరరావును ఫిరంగిపురం బదిలీ చేశారు.

ఉత్తమ హెచ్‌ఎంకు సత్కారం

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఉత్తమ హెచ్‌ఎంగా శాలివాహన చారిటబుల్ ట్రస్టు ఎంపిక చేసిన బొప్పూడి హైస్కూలు హెచ్‌ఎం పి.వెంకటేశ్వర్లును హైదరాబాదు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల అభివృద్ధికి హెచ్‌ఎం చేస్తున్న కృషికి గుర్తింపుగా శాలివాహన విశిష్ట ప్రతిభాపురస్కారం-2024అందజేసి సత్కరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు హెచ్‌ఎంను అభినందించారు.


హెచ్‌ఎం వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

సమస్యల నిలయాలు.. శివారు కాలనీలు

చిలకలూరిపేటలో పరిస్థితి ఇదీ

న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ


కాలనీకి వెళ్లే మార్గంలో కంపచెట్లు

పేద, నిరుపేద వర్గాలు అధికంగా నివసించే శివారు కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. చిలకలూరిపేట పట్టణంలోని రూత్‌డైక్‌మెన్ నగర్, మదర్‌థెరీసా కాలనీ, ఆరిపుల్లా నగర్, వైఎస్సార్ కాలనీ, మద్దినగర్, కోండ్రుపాడు, ఎన్టీఆర్ కాలనీ, టిడ్కో గృహాలు, రాజీవ్ స్వగృహ ప్రాంతాల్లో ప్రజలకు కనీస వసతులు లేవు. రాజీవ్ స్వగృహ ప్రాంతంలో మొత్తం 8 భవనాల్లో 192 కుటుంబాలు ఉండేవి. వసతులు లేక ప్రస్తుతం కేవలం సగం ఇళ్లలో మాత్రమే నివసిస్తున్నారు. టిడ్కో గృహాల్లో 2 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారికి కూడా పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేని పరిస్థితి.


గంగమ్మ గుడి కాలనీకి వెళ్లే దారి ఇలా..

వీధి దీపాలు వెలగటం లేదు



వైఎస్సార్ కాలనీలోని వీధుల్లో దీపాలు వెలగటం లేదు. కాలనీలో చివరి రెండు బజార్లకు తాగునీరు రావడం లేదు. మురుగు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. మొదట్లో ఉన్న వీధుల్లో కుళాయిలు ఆపేందుకు వీలు లేకపోవటంతో నిత్యం నీరు వృథాగా పోతుంది. - **చంద్రశేఖర్, వైఎస్సార్‌కాలనీ**

కంపచెట్లతో భయంభయంగా



రాజీవ్ గృహకల్ప భవనాల్లో నివసిస్తున్నా భయంభయంగా బతుకుతున్నాం. ఇళ్ల మధ్యలో కంపచెట్లు, పాములు సంచరిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేదు. వసతులు లేక చాలామంది వెళ్లిపోయారు. - **ఫణి, రాజీవ్ స్వగృహ కాలనీ**

మున్సిపల్ డీఈగా మహమ్మద్ రఫీ

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: నరసరావుపేట మున్సిపల్ డీఈగా మహమ్మద్ రఫీని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈయన గుంటూరు నుంచి బదిలీపై నరసరావుపేటకు రానున్నారు. ఇక్కడ డీఈ శ్రీనివాసరావును పిడుగురాళ్ల మున్సిపాలిటీకి బదిలీ చేసింది.

ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని పలు విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో యల్లమంద గ్రామంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. విలేజ్ క్లినిక్, పంచాయతీ కార్యాలయ పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో మొక్కలు నాటారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పిచ్చి మొక్కలు తొలగించారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.


కొరటాల శివ

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని నెగెటివ్‌గా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు?

"మనిషికి ధైర్యం అవసరమే కానీ మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి..విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది?

"జాన్వీ చాలా ప్రతిభావంతురాలు. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. కథ రాసుకున్నప్పుడే భైరా పాత్రకు సైఫ్ అయితేనే సరిపోతారనిపించింది. ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం కష్టపడ్డారు".

ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".

ఈనాడు సినిమా



ఎర్ర మందారం... మెరుపు సింగారం

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్య రాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్రమందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలిసారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై ఆకట్టుకున్నారు.

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర


సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటు"న్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం కనిపించడం ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు.

రోమ్‌ను కాపాడేందుకు 'గ్లాడియేటర్' పోరు



మరిన్ని విశేషాలు www.eenadu.net లో


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, సురేశ్‌బాబు

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం

"'ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకమైన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెరపైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. "ఈ చిత్రంలో బావ..బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి అందమైన చిత్రం" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, ప్రశాంత్ వర్మ, డి.సురేశ్‌బాబు, సునీల్ నారంగ్, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం


హసిత్ గోలి

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబరు 4న రానున్న నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.

★ "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి".

★ "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం".

★ "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి".

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!


శ్రీహర్ష, కషిక కపూర్

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది" అన్నారు.

విగ్రహ నిమజ్జనంలో విషాదం

కాలువలో నీట మునిగి యువకుడి మృతి


షేక్ రఫీ (పాతచిత్రం)

సత్తెనపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే : సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు పరిధిలోని కాలువ వద్ద వినాయకుడి విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో మంగళవారం తెల్లవారుజామున అపశ్రుతి చోటు చేసుకుంది. షేక్ రఫీ (19) కాలువ నీటిలో గల్లంతై.. కొద్ది సేపటికి మృతదేహంగా దొరికాడు. కొట్టుకుపోతున్న మరో యువకుడిని రక్షించారు. పట్టణంలోని పీర్లచావిడి సెంటరులో గణనాథుడి భారీ విగ్రహం ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి విగ్రహం నిమజ్జనం చేసేందుకు గుంటూరు బ్రాంచి కాలువ వద్ద వెళ్లారు. నీటిలో నిమజ్జనం చేస్తుండగా షేక్ రఫీ, గండేపల్లి తిరుపతిరావు ఉత్సాహంగా నీటిలో దిగారు. కాలువ ప్రవాహానికి ఇద్దరూ కొట్టుకుపోతుండగా తోటి యువకులు గమనించి తాడు విసిరారు. తాడు పట్టుకున్న తిరుపతిరావును ఒడ్డుకు లాగారు. అప్పటికే రఫీ నీటిలో కొట్టుకుపోయాడు. పూర్తిగా తెల్లవారకపోవడంతో చీకటిలో జాడ గుర్తించలేకపోయారు. మంగళవారం సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో పోలీసులు గాలింపు చేపట్టారు. గజ ఈతగాళ్లతో నీటిలో వెతికారు. రాత్రికి మృతదేహం దొరికింది. షేక్ పీరుబుడే, జాకిరా దంపతుల కుమారుడైన రఫీ పదో తరగతితో చదువు ఆపాడు. అల్పాహార బండి నిర్వహిస్తున్న తండ్రికి అండగా ఉండేవాడు. కుమారుడి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


సురేష్, రాఘవరావు (పాత చిత్రాలు)

యడ్లపాడు, ఘట్‌కేసర్: అతివేగం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సీఐ సైదులు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన ఇడుపులపాటి సాంబయ్య నిజామాబాద్ జిల్లా వర్ని మండలం, సైడియల్ గ్రామంలో 40 ఏళ్ల క్రితం వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. దానికి సంబంధించిన ఆన్‌లైన్ పని నిమిత్తం సాంబయ్య కొడుకు సురేష్ అదే గ్రామానికి చెందిన సామినేని రాఘవరావు, కాకుమాను అమ్మయ్య, ముక్త రమేష్‌లు ఈ నెల 22న కారులో వర్ని గ్రామానికి వచ్చారు. అక్కడ పని పూర్తి అయిన తరువాత సోమవారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం తెల్లవారుజామున ఘట్‌కేసర్ వద్ద ఔటర్ మీదుగా వస్తుండగా కారు నడుపుతున్న సురేష్ ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో కారు బోల్తాపడింది. సురేష్(35) తోపాటు అతని పక్కన కూర్చున్న రాఘవరావు(45) అక్కడికక్కడే మృతి చెందారు. అమ్మయ్య, రమేష్‌లకు గాయాలు కావడంతో స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతివేగంతో పాటు నిద్ర మత్తు కారణంగా జరిగిందని సీఐ చెప్పారు.

నాసిరకం వంటకాలతో విద్యార్థులకు అనారోగ్యం


బాలుడిని పరామర్శిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడు మండలం వంకాయలపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థుల వంటకు గడువు తీరిన సరకులను వినియోగిస్తున్నట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి చెప్పారు. పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. వసతి గృహం, వంటశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక పాఠశాల విద్యార్థుల హక్కులకు భంగం వాటిల్లినట్లు తెలిపారు. గత నవంబరులో గడువు తీరిన రాగి పిండితో చేసిన జావ విద్యార్థులకు ఆహారంగా ఇవ్వటంతో అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. ఆహారం నాసిరకంగా ఉండటంతో పాటు పురుగులు ఉన్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ హనుమంతరావు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ప్రిన్సిపల్‌పై చర్యలకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఐసీడీఎస్ పీడీ కె.ఉమారాణి, సీడీపీవో శాంతకుమారి, తహసీల్దార్ విజయశ్రీ, ఎంఈవో నాగరత్నం, ఎంపీడీవో హేమలత, ఎస్సై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయాలు, వాచ్‌మెన్లకు జీతాల మంజూరు

ఈనాడు కథనానికి స్పందన

సత్తెనపల్లి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, వాచ్‌మెన్లకు జీతాలొచ్చాయి. 'ఆయాలు, వాచ్‌మెన్లకు జీతాల్లేవ్' శీర్షికన ఈ నెల 22న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. జిల్లాలోని 1576 పాఠశాలల్లో పని చేస్తున్న 1647 మంది ఆయాలు, 170 మంది వాచ్‌మెన్లకు గత మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల వేతనాన్ని వారి బ్యాంకు ఖాతాలకు మంగళవారం జమ చేశారు.

వైకాపా నేత సింగారెడ్డి కోటిరెడ్డిపై కేసు నమోదు

దొంగ పత్రాలతో స్థలం కబ్జా ★ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు


మాజీ మంత్రి రజని, మాజీ స్పీకర్ తమ్మినేనితో కోటిరెడ్డి (పాత చిత్రం)

చిరుమామిళ్ల (నాదెండ్ల), న్యూస్‌టుడే: చిలకలూరిపేట మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్, వైకాపా నేత సింగారెడ్డి కోటిరెడ్డిపై నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. స్వగ్రామంలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి వారసత్వ స్థలాన్ని కబ్జా చేసిన వ్యవహారం రెండేళ్ల తర్వాత వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం చిరుమామిళ్ల రజక కాలనీకి చెందిన అన్నవరపు శ్రీనివాసరావు ఇస్త్రీ చేసుకుంటూ గుంటూరు బహుళ అంతస్తు భవన సముదాయానికి కాపలాదారునిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాల పక్కన 10 సెంట్లు నివేశన స్థలం వారసత్వంగా సక్రమించింది. దీని విలువ రూ.15 లక్షలు వరకు ఉంది. తెదేపా సానుభూతి పరుడైన ఇతన్ని వైకాపా నేతలు బెదిరించడంతో ఆరేళ్లుగా ఊరు వదిలి గుంటూరుకే పరిమితమయ్యాడు.

దొంగ పత్రం సృష్టించి స్థలం కబ్జా.. : చిలకలూరిపేట మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి ఆయన కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి ఈ ఖాళీ స్థలం కబ్జా చేశారు. తమ ముఖ్య అనుచరుడైన గుడికందుల వీరాంజనేయులు భార్య మల్లేశ్వరి (అంగన్‌వాడీ సహాయకురాలు) పేరుతో వైకాపా ప్రభుత్వ హయాంలో దొంగ నివేశన ధ్రువపత్రం తయారు చేయించారు. వారితో నకరికల్లు మండలం రుపెనగుంటకు చెందిన దంతం సాంబశివరావుకు రిజిస్ట్రేషన్ చేయించారు. తమ కుటుంబానికి ఆధారమైన స్థలాన్ని కబ్జా చేసిన వైకాపా నేతను ఎదరించలేక శ్రీనివాసరావు భార్య మంగమ్మ దిగులుతో గుండె జబ్బుకు గురై మృతి చెందింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో బాధితుడు నాదెండ్ల పోలీసులను ఆశ్రయించాడు. తనకు వైకాపా నేతలు చేసిన అన్యాయంపై ఫిర్యాదు చేశాడు. దీంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు మంగళవారం తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి దొంగ ధ్రువపత్రం జారీ చేసిన అప్పటి పంచాయతీ కార్యదర్శి పాత్రపై కూడా విచారిస్తున్నట్లు వెల్లడించారు.

భార్యతో వేగలేక అజ్ఞాతం.. విడాకులు మంజూరయ్యాక ఇంటికి

ఏడేళ్ల తరువాత తల్లి చెంతకు కుమారుడు


దేవదానంతో అతని తల్లి మరియమ్మ, సీఐ విజయ్ చరణ్

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: భార్యతో వచ్చిన మనస్పర్థలు తాళలేక ఏడేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న ఓ వ్యక్తి విడాకులు మంజూరయ్యాక ఇంటికి చేరాడు. నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన జోసెఫ్ దేవదానం ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. పల్నాడు జిల్లా నరసరావుపేట రామిరెడ్డికి చెందిన మేనత్త ఇంటికి చుట్టం చూపుగా వచ్చి ఆమె కుమార్తె షైనీని ప్రేమించి 2008లో వివాహం చేసుకున్నాడు. వివాహమైన ఆరునెలలకే ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. తర్వాత బెంగళూరులో కాపురం పెట్టారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు తొలగకపోవడంతో తల్లిదండ్రులే నచ్చచెప్పారు. అలా తొమ్మిదేళ్లు నెట్టుకొచ్చారు. అయినా భార్యతో గొడవలు సద్దుమణగకపోవడంతో 2017లో ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయాడు. సొంతూరు మదనపల్లికి కూడా వెళ్లలేదు. వెంటనే భార్య షైనీ తన భర్త అదృశ్యమైనట్లు నరసరావుపేట వన్‌టౌన్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచీ అతని జాడ కోసం వెతుకుతున్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ కావడంతో తిరుపతిలో కొన్నేళ్లు ఒంటరిగా ఉంటూ జాబ్ చేస్తూ జీవనం కొనసాగించాడు. ఆ తర్వాత కరోనా సమయంలో తండ్రి చనిపోయాడని తెలిసి తిరుపతిలో ఉంటున్న అతను మదనపల్లి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించి, తన కోసం వెతకొద్దని చెప్పి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయాడు. అక్కడ కూడా ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం భార్యతో అతనికి విడాకులు మంజూరయ్యాయి. దీంతో అజ్ఞాతం వీడి తల్లిచెంతకు చేరాడు. స్నేహితులు, బంధువుల చొరవతో పోలీసులు జోసెఫ దేవదానంను మంగళవారం తల్లి మరియమ్మకు అప్పజెప్పినట్లు నరసరావుపేట ఒకటో పట్టణ సీఐ విజయ్ చరణ్ పేర్కొన్నారు.

భారీ వర్షం.. పంట పొలాలు జలమయం


చప్టామీద వరద ఉద్ధృతిలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న పాఠశాల బస్సు


మండాదిలో నీట మునిగిన మిరప పంట

వెల్దుర్తి, న్యూస్‌టుడే : మండలంలో సోమవారం అర్ధరాత్రి, మంగళవారం కురిసిన వర్షానికి పలు చెరువులు నిండుకుండల్ని తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. మండాది, బోదిలవీడు, రచ్చమలపాడు, శ్రీరాంపురం తండాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండాది- రచ్చమలపాడు రహదారిపై ఉన్న కానుగ వాగు చప్టాపై వరదనీరు ఉద్ధృతంగా పారగా రెండు గ్రామాల ప్రజల రాకపోకలకు సూమారు మూడు గంటలు అంతరాయం ఏర్పడింది. మండాది వద్ద కానుగవాగు పొంగి పక్కనే ఉన్న పంట పొలాలపై పడటంతో మిరప, పత్తి, పొగాకు పంటలు నీట మునిగాయి. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కానుగవాగు చప్టా వద్దకి వెళ్లి వరద ఉద్ధృతి పరిశీలించారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన


వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రాములు, రజినీ, డీడీఏ శివకుమారి, ఏడీఏ మస్తానమ్మ తదితరులు

రొంపిచర్ల, న్యూస్‌టుడే: వరిలో యాజమాన్య పద్ధతులను ప్రతి రైతు తప్పనిసరిగా పాటించాలని డాట్ సెంటర్ ప్రధాన శాస్త్రవేత్త వెంకట రాములు అన్నారు. మండలంలోని విప్పర్ల, నల్లగార్లపాడు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే అరవిందబాబు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ప్రారంభించారు. తొలుత పొలం పిలుస్తోంది గోడపత్రికలను ఆవిష్కరించారు. డాట్‌సెంటర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ వరిలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. మరో శాస్త్రవేత్త రజినీ మాట్లాడుతూ రైతులు పొలాల్లో సేంద్రీయ కర్బన శాతాన్ని పెంచుకోవాలన్నారు. కర్బన శాతం 1.0 శాతం ఉన్న రైతులందరూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి మాట్లాడుతూ వరిలో చీడపీడల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏడీఏ మస్తానమ్మ, ఏవో శివలలిత, వెటర్నరీ వైద్యులు శ్రీకాంత్, వీఏఏ రాజశేఖర్, వేమారెడ్డి, తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్ సద్వినియోగం చేసుకోవాలి


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అక్బర్ ఆలీ, చిన్నరామయ్య తదితరులు

శావల్యాపురం, న్యూస్‌టుడే: శావల్యాపురం జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ప్రారంభించిన ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కోఆర్డినేటర్ అక్బర్ ఆలీ పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి, ఈ విద్యలో చేరడానికి ప్రవేశాలు ప్రారంభించాలని ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మీకి చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో చేరే వారు 14 ఏళ్లు నిండటంతోపాటు చదవడం, రాయడం పరిజ్ఞానం కలిగి ఉండాలని, బడి మధ్యలో మానేసిన వారు ఉపయోగించుకోవచ్చన్నారు. ఇంటర్ విద్య అభ్యసించే వారు 15 ఏళ్లు నిండి పదోతరగతి పూర్తయిన, ఫెయిల్ అయిన వారు, ఇంటర్ మధ్యలో మానేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన గోడపత్రికను జిల్లా కోఆర్డినేటర్ పాపసాని చిన్నరామయ్య, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు బి.వి. నాగేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు.